క్లుప్తంగా

ఉద్యమంతోనే సీపీఎస్ రద్దు

అడ్డాకుల: ఉద్యోగుల సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి డిమాండ్ చేశారు. మూసాపేట మండల కేంద్రంలో మంగళవారం వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దును డిమాండ్ చేస్తూ తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత పెన్షన్ సంకల్ప రథయాత్ర ఈనెల 16న అలంపూర్ నుంచి మొదలైందని, 30న మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమం ద్వారానే సీపీఎస్ రద్దు సాధ్యమవుతుందని తెలిపారు. ఇందుకోసం ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. అనంతరం రథయాత్ర గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ స్వరూప, డీటీ వరప్రసాద్, ఎంపీఓ సరోజ, ఏఓ రాజేందర్‌రెడ్డి, టీపీయూఎస్ మండలాధ్యక్షుడు రవినాయక్ ఉన్నారు.

కాంగ్రెస్‌ది కపటప్రేమ

కోయిల్‌కొండ: రైతులపై కాంగ్రెస్ నాయకులు కపట ప్రేమ చూపిస్తున్నారని జెడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వింజామూర్ రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయంలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం సీఎం కేసీఆర్ రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నారని కొనియాడారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి, మోదీపూర్ రవి, వాసు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత

చిన్న చింతకుంట: గూడూరుకు చెందిన విద్యార్థి ఫర్హ షిరిన్ మైనార్టీ జూనియర్ కళాశాల జడ్చర్లలో ఇంటర్ బైపీసీలో 971 మార్కులు సాధించినందుకు మంగళవారం వీవీపీ సంస్థ ఆధ్వర్యంలో రూ. 20వేల నగదు ప్రశంసా పత్రం జిల్లా కేంద్రంలో అందించారు. నగదును విద్యార్థి పేరున డిపాజిట్ చేశారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

కూలుతున్న ఇళ్లు

నవాబుపేట: వరుస వర్షాలకు ఇళ్లు కూలుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాగా ముసురు వర్షం నేపథ్యంలో అధికారులు ముందుగానే హెచ్చరిస్తుండటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూసుకుంటున్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో 5 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు అధికారులు వివరించారు. కాగా వాటిలో నష్టపోయిన వాటి వివరాలు, వానలకు తడిసిన వస్తువులపై ఆరాతీస్తున్నట్లు తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

సబ్సిడీ గొర్రెల పంపిణీ

రాజాపూర్: రాష్ట్ర ప్రభుత్వం కురుమయాదవులకు సబ్సిడీపై ఇచ్చిన గొర్రెలను మంగళవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ కార్తీక్ గ్రామాల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. ఈసీజన్‌లో వచ్చే వ్యాధుల నుంచి వాటిని రక్షించుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు సుధారాణి, గంగాధర్‌గౌడ్, యాదవులు మల్లేష్‌యాదవ్, బుచ్చయ్య, ఎర్రన్న బీరయ్య, అత్తెలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న స్కూల్ స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర నాయకుడు బాలగౌడ్ అన్నారు. స్వీపర్ల రిలే దీక్షలు మంగళవారం 30వ రోజు కొనసాగాయి. కార్యక్రమంలో చెన్నరాయుడు, బాలరాజు, జయమ్మ, అలివేలు, వెంకటేశ్వరమ్మ, సత్యమ్మ, వెంకటయ్యపాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

భూత్పూర్: హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కు చెందిన ఆర్పీ సువర్ణ భర్త స్వామిని మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలన్నారు. సువర్ణకు వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా శేరిపల్లికి చెందిన ఐశ్వర్య ప్రమాదశాత్తు గాయపడి నిమ్స్‌లోనే చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించారు.

‘అవినీతి ఆకాశాన్ని అంటింది’

రాజాపూర్: బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి ఆకాశాన్ని అంటిందని, పరిపాలన పాతాలంలోకి పోయిందని అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మంగళవారం అనిరుధ్‌రెడ్డి ప్రజాహిత పాదయాత్రలో పాల్గొని కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఇంటికో ఉద్యోగం, పేదలకు డబుల్ బెడ్‌రూం, రైతులకు సబ్సిడీపై పరికరాలు వంటివి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని అన్నారు. ధరణి తెచ్చి భూములన్ని మాయం చేస్తున్నారని ఆరోపించారు. అనిరుధ్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు 53 గ్రామాల్లో తిరిగి సమస్యలు తెసుకున్నానని అన్నారు. మాజీ జెడ్పీటీసీ రబ్బాని, నాయకులు నిత్యానందం, శ్రీనివాస్, కృష్ణయ్య, శంకర్‌నాయక్, యాదయ్య పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు

● పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్



పాలకొండలో బోనాలతో పోచమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తొమ్మిదో వార్డు పరిధిలోని పాలకొండలో మంగళవారం సాయంత్రం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు బోనాలతో ఊరేగింపుగా సమీపంలోని పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పోచమ్మ అమ్మవారు ఇచ్చిన శక్తితో జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పాలకొండ చెరువును వచ్చే ఏడాదికల్లా మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి బోటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ మూషా నరేందర్, బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు తీగల ఆంజనేయులు, నాయకులు సురేందర్‌యాదవ్, వెంకట్రాములు పాల్గొన్నారు.

జిల్లావాసికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని రాంచంద్రాపూర్‌నకు చెందిన గంగాధర్ చారీ తమిళనాడులోని గాంధీగ్రాం సెంట్రల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ సాధించారు. ఈమేరకు డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ భత్సవత్సల పెరుమాళ్ ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలుగా ‘సమ్మిళిత విద్య అవగాహన, పాఠశాల ఇంటర్న్‌షిప్‌పై బీఈడీ ఛాత్రోపాధ్యాయుల అంచనాలు, అవగాహనలు అంశంపై పరిశోధనలు చేశారు. పరిశోధన పత్రాన్ని సమర్పించిన అనంతరం యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సందర్భంగా గంగాధరాచారీని పలువురు ప్రజాప్రతినిధులు, మిత్రులు, కుంటుంభ సభ్యులు అభినందించారు.

పొలంలో దిగబడిన కారు

అడ్డాకుల: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పని తీరును పరిశీలించడానికి మూసాపేట మండలం అచ్చాయపల్లికి అధికారుల బృందం వచ్చిన సమయంలో అదనపు ఎస్పీ రాములు కారు పొలంలో దిగబడింది. గ్రామానికి కొంత దూరంలో ఉన్న శ్మశానవాటిక, డంపింగ్‌యార్డును పరిశీలించడానికి అధికారులు కార్లలో అక్కడికి వెళ్తుండగా పొలంలో కూరుకుపోయింది. అక్కడ పరిశీలన తర్వాత అధికారులు మరో కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత గ్రామస్తుల సాయంతో టైర్ల వద్ద మట్టిని తొలగించిన డ్రైవర్ కారును బయటకు తీశారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



అడ్డాకుల: వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ సీఎం కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తూ మూసాపేట మండల కేంద్రంలో వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం తహసీల్దార్ మంజుల, డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ సమక్షంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గట్టు నరేష్‌గౌడ్, కృష్ణ, ఆంజనేయులు, కాశన్న, చందు, యాది, సత్యనారాయణ, స్వప్న, సరిత ఉన్నారు.

పట్టపగలే ద్విచక్రవాహనం చోరీ

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామంలో పట్టపగలే గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన పల్లెమోని శివ, రామకృష్ణలు కలిసి తమ గ్లామర్ ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి పొలం వద్దకు బయలుదేరారు. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన పొలం సమీపంలోనే మధ్యాహ్నం ట్రక్ పార్కింగ్ జోన్ వద్ద పాత హైవేపై బైక్‌ను నిలిపి పొలానికి వెళ్లారు. పనులు చూసుకుని తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించ లేదు. దీంతో చుట్టు పక్కల వెతికారు. ఆచూకీ లేకపోవడంతో మూసాపేట ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ కె.శ్రీనివాసులు చెప్పారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బాలానగర్: భూ తగాదాలతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. హేమాజీపూర్ గ్రామం బిల్డింగ్ తండాకు చెందిన రవీందర్, రవి భూమి విషయంలో గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ప్రారంభించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చుకొంటే మంచి పౌరులుగా తయారవుతారని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో మంగళవారం నూతనంగా ఎన్నికై న కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ, వ్యక్తిగత మూర్తిమత్వాన్ని పెంపొందించుకునేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సాధనంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ విషయంపై తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ భవన అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని వివరించారు. శిక్షణ శిబిరాల ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేగాక స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనం ప్రధాన రహదారి వైపు ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరుకు సహరిస్తామన్నారు. కాగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లా కలెక్టర్, సెక్రటరీగా జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, ఉపాధ్యక్షులుగా మల్లారెడ్డి, బెక్కరి రామిరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, వీణ, ట్రెజరర్‌గా ధనుంజయ రెడ్డి, ట్రైనింగ్ కమిషనర్‌గా జె. హనుమంతు, విజయలక్ష్మి, జాయింట్ సెక్రెటరీగా స్వరూప రాణి ఎన్నికయ్యారు. జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఎం రాజాగోపాల్, చీఫ్ కమిషనర్ ఎస్.మల్లారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు నటరాజ్ తదితరులు హాజరయ్యారు.

పెద్దరేవల్లి బీటీ రోడ్డుకు రూ.56 కోట్లు



హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

బాలానగర్: మండల కేంద్రం నుంచి గంగాపూర్, పెద్దరేవల్లి బీటీరోడ్డు విస్తరణకు రూ.56 కోట్లు మంజూరయ్యాయని జెడ్పీటీసీ కల్యాణి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే చొరవతో అత్యంత నాణ్యతగా రోడ్డు నిర్మాణం జరగనుందని హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో బాలానగర్, గౌతాపూర్, అప్పాజిపల్లి, బోడగుట్ట తండా, పెద్దరేవల్లి, తిరుమలగిరి, పెద్దబాయితండా గ్రామ పంచాయతీలతో పాటు ఇతర గ్రామాలు ఎంతో మేలు జరగనుందని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ వెంకటచారి, రైతుబంధు అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎర్రసత్యం జయంతి



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో మంగళవారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రవీందర్, బీసీ సంఘం అధ్యక్షుడు మేకల సత్యనారాయణ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నవాబుపేట: మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం జయంతి ని⁰పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, రాజేష్, ఖాజా, షబ్బీర్, మల్లేష్, ఆనంద్, నర్సింహులు, సత్యం, రమేష్, మల్లేష్, మణి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



మహబూబ్‌నగర్ రూరల్: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాల, సమాజానికి గుర్తింపు తీసుకురావాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోడూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల్లో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వారంలో మూడు రోజులుగా రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఎంసీ చైర్మన్లు శ్రీనివాసులు, సురేష్, ప్రధానోపాధ్యాయులు రావిపాల్, రమేష్‌గౌడ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై వామపక్షాల నిరసన

జడ్చర్ల టౌన్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై ప్రధానమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జగన్, సీపీఐ కార్యదర్శి కృష్ణయ్యలు మాట్లాడుతూ మణిపూర్ హింసకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత తీసుకోవాలన్నారు. పరిస్థితులను వెంటనే చక్కదిద్దాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పరశురాం, తెలుగు సత్తయ్య, లక్ష్మీదేవి, మున్నా, సాయిలు, జంగయ్య, మన్సూర్, కృష్ణలు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించడంలో విఫలం



అడ్డాకుల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గుడిబండలో మంగళవారం బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు చింతకింది నర్సిములుతో పాటు మరికొందరు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, గుడిబండ ఎంపీటీసీ శకుంతల, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు నాగిరెడ్డి ఉన్నారు.

చిన్నచింతకుంట: ఎదులాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల కార్యకర్తలు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి సమక్షంలో మంగళవారం దమ్గాన్పూరంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్‌ఎస్ సర్కార్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నిరుపేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో నియోజకవర్గం పరిధిలోని 9 మందికి రూ.5,37,500 విలువైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. త్వరలో ప్రారంభమయ్యే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా స్థానికంగానే అన్ని రకాల రోగాలకు వైద్యం అందిస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట 33వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులతో పాటు 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పదోవార్డు పరిధిలోని క్రిస్టియన్‌పల్లి–ఆదర్శ నగర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద రూ.ఐదు లక్షలతో నిర్మించే ప్లంబర్ అసోసియేషన్ వర్కర్స్ కమ్యూనిటీ హాల్‌కు మంగళవారం మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సిములు, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, గిరిధర్‌రెడ్డి, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ రాణి, ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సత్యం, ప్రధాన కార్యదర్శి ముక్తార్‌ఖాన్, కోశాధికారి ఎం.ఎ.నజీర్ పాల్గొన్నారు.

సన్నాహక సభకు తరలిరండి

బాలానగర్: జడ్చర్లలో ఈ నెల 30 నిర్వహించబోవు సన్నాహక సభకు ప్రతి ఇంటినుంచి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సతీష్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టి ఆమోదించాలని అన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో సంపూర్ణ మెజారిటీతో ఉన్నా ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. నాయకులు విష్ణువర్ధన్, గణేష్, చంద్రయ్య, మల్లేష్, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లు మూసుకుని కార్మికుల నిరసన

నవాబుపేట: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు మంగళవారం కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. సంఘం నాయకులు లక్ష్మయ్య, శ్రీనివాస్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు డప్పులు వాయిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, మండల నాయకులు వెంకట్‌రాములు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్‌గా నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ రాంచందర్‌రావు

కోయిల్‌కొండ: ఆర్డీఓ రాంచందర్‌రావు 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బూత్‌లెవల్ అధికారులకు సదస్సు నిర్వహించారు. ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మృతిచెందిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్ మురళీ, ఆర్ఐ బురాన్, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న తపస్ నాయకులు

జడ్చర్ల టౌన్: దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. డీటీ వెంకటేశ్వరికి తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బాబునాయుడులు వినతిపత్రం సమర్పించారు. 50 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పదోన్నతులు కల్పిస్తూ బదిలీలు చేపట్టాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని, అన్ని ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డు ద్వారా ఉచిత చికిత్స అందింపజేయాలని, పీఈటీ, పండితుల పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని వినతిపత్రంలో పొందుపర్చారు. మండల అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: తపస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధ్యాయుల సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్‌కు మంగళవారం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాములపై అవగాహన



మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ సదాశివయ్య సర్పో రక్షతి, రక్షిత: కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాముకాటుకు ప్రథమ చికిత్స తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. హెచ్ఎం రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటుగా, కొత్తూర్, మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, వారికి అర్థం అయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆమె వెంట క్లస్టర్ హెచ్ఎం రవికుమార్ తదితరులు ఉన్నారు.

వీరారెడ్డికి ఘన నివాళి

దేవరకద్ర: మాజీ ఎమ్మెల్యే, ఆప్కాబ్ మాజీ చైర్మన్ వీరారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్, నాయకులు రాందాసు, టీసీ శ్రీనివాస్, రాము, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



జడ్చర్ల టౌన్: హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో బాదేపల్లి యార్డు వద్ద మొక్కలు నాటారు. చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మహమ్మద్ అలి దానిష్, డైరెక్టర్లు వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాన్‌అలి, మచ్చలశ్రీను, రామావతార్ జవహర్, గోపాల్, కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

దేవరకద్ర: పట్టణంలో మొక్కల పంపిణీ మంగళవారం చేపట్టారు. సర్పంచ్ విజయలక్ష్మి, ఈఓ సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

30న సదస్సు

మిడ్జిల్: జడ్చర్ల నియోజక వర్గ స్థాయి బీఆర్‌ఎస్ యువత సదస్సును విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు బంగారు కోరారు. మంగళవారం యువత సదస్సుపై మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అధ్యక్షతన సదస్సు సాగుతుందని వివరించారు. యువజన నాయకులు నవీన్, భీంరాజ్, లక్ష్మన్, రాఘవేందర్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్పీ

జడ్చర్ల టౌన్: కొండేడ్ వాగులో ఇద్దరు యువతులు మృతిచెందిన ఘటనస్థలాన్ని పరిశీలించి తిరిగి వస్తున్న క్రమంలో ఎస్పీ నర్సింహ గౌడ్ మానవత్వం చాటుకున్నారు. జడ్చర్ల మండలం గోప్లాపూర్ గేట్‌సమీపంలో రోడ్డుపై ఉన్న గోతిలో ఓ కారు టైరు ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్న వాహనదారుడి గమనించి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది ద్వారా సాయం అందించి వాహనాన్ని బయటకు తీయించారు. మట్టితో గోతిని పూడ్చివేయించారు. దీంతో వాహనదారులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.